క్లుప్తంగా

గ్రంథాలయాలు సద్వినియోగం చేసుకోవాలి

చీరాల అర్బన్: విజ్ఞానాన్ని పెంపొందించేందుకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయని గ్రంథపాలకురాలు డి.ధనమ్మ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం పాఠశాల విద్యార్థులతో నీతి కథలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, విజ్ఞానదాయకమైన పుస్తకాలు విద్యార్థులతో చదివించి పుస్తక సమీక్ష నిర్వహించారు. అలానే విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. గురువారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ముగుస్తాయని, ముగింపు కార్యక్రమాన్ని గ్రంథాలయంలో నిర్వహిస్తున్నామన్నారు.

కవిరాజు సుబ్బారావు మృతి

- నూరేళ్ల జీవితం అనుభవించిన సాహితీ వేత్త


కారెం వెంకట సుబ్బారావు

వేటపాలెం: పందిళ్లపల్లి స్వగ్రామంలో కవిరాజుగా పిలుచుకునే సాహిత్య సరస్వతి కడెం వెంకట సుబ్బారావు (100) మంగళవారం రాత్రి మృతి చెందారు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడున్నారు. ఈయన వేటపాలెం బండ్ల బాపయ్య హిందూ హైస్కూల్లో తెలుగు పండిట్‌గా చిరకాలం పని చేసి విద్యార్థులను తీర్చి దిద్దారు. తెలుగు సాహిత్యానికి విశేష కృషి చేశారు. జీవనజ్యోతి, బడ్ల తిక్కన, ఆత్మశిఖరాగ్రం, పుణ్యపురుషుడు, దేవాంగ పురాణం, వేమన మొదలైన గ్రంథాలను రచించారు. తావల గురు సాంప్రదాయకులు అచల పరిపూర్ణులుగా అనేక గ్రంథాలు రచించడమే కాకుండా గురువుగా అనేక మంది శిష్యుల్ని తయారు చేశారు. పందిళ్లపల్లిలోని శివరామ దీక్షిత అచల పరిపూర్ణ మండలి అచలాశ్రమం నిర్వహించారు.

కేసులు నమోదు చేస్తాం

బల్లికురవ: సార్వత్రిక ఎన్నికలు, కౌంటింగ్ ప్రశాంతంగా ముగిసిందని గ్రామాల్లో కవ్వింపు చర్యలతో ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై రవిశంకర్ రెడ్డి తెలిపారు. కౌంటింగ్ తదుపరి మంగళవారం రాత్రి మండలంలోని వైదన, కొప్పరపాలెం గ్రామాల్లో జరిగిన చిన్న, చిన్న సంఘటలకు సంబంధించి పోలీస్ పికెటింగ్ నిర్వహించారు. ఈ రెండు గ్రామాలు 144 సెక్షన్ అమల్లో ఉందని అల్లర్లకు పాల్పడితే రౌడీ షీట్ కూడా ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

సాగు భూములు సిద్ధం చేసుకోండి

- ఖరీఫ్‌కు ముందే వాటిని సిద్ధం చేసుకోవాలి
- వాలుగా భూములను దున్నుకుంటే ఉపయోగాలు
- వ్యవసాయాధికారి సుధీర్‌బాబు


సాగుకు సన్నద్ధమైన మాగాణి భూములు

కారంచేడు: ఖరీఫ్ సీజన్ మొదలవుతున్న తరుణంలో అన్నదాతలు తమ పంట పొలాలను సిద్ధం చేసుకోవడంలో నిమగ్నమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో తమ భూములను ఏ పంటకు ఎలా దున్నుకోవాలో వ్యవసాయాధికారి కె. సుధీర్‌బాబు తెలిపారు. సాగుకు సహకరించని భూములను ఎలా సిద్ధం చేసుకోవాలో తెలియజేశారు.

వాలు ఎక్కువగా ఉంటే..

వాలుగా ఉండే భూముల్లో నేల కోత ఎక్కువగా ఉంటుంది. భూసారం కూడా తక్కువగానే ఉంటుంది. నీటి నిల్వ శక్తి తగ్గిపోవడం వలన బెట్ట పరిస్థితులు త్వరగా ఏర్పడతాయి. దీని వలన పంట దిగుబడులు కూడా తగ్గే అవకాశం ఉంటుంది. వాలు ఎక్కువగా ఉండే నేలల్లో వాలుకు అడ్డంగా సేద్యం చేపట్టుకోవాలి. అలాగే పంట సాగు చేసిన మూడు, నాలుగు వారాల తరువాత పెద్ద నాగలితో ప్రతి 3.5 మీటర్లకు వర్షపు నీరు సంరక్షణ కోసం గొడ్డుచాలు (తల్లిచాలు) దున్నుకోవాలి. వాలు తీవ్రత మరీ ఎక్కువగా ఉంటే గట్లను నిర్మించుకోవాలి. ఈ గట్లు వర్షపు నీటి ప్రవాహ వేగాన్ని ఆపి నేలలో నీటి నిల్వలను పెంచేందుకు ఉపయోగపడుతుంది. వీటిని ఏర్పాటు చేసుకొనేప్పుడు ప్రతి మీటరు నిలువుకు గట్టు ఏర్పాటు చేసుకోవాలి.

లోతు తక్కువగా ఉంటే..

ఈ నేలల్లో సాగు చేసిన పంటలకు సంబంధించి మొక్కల వేర్లు పెరుగుదల తగ్గి నీరు, భూసారం పరిమితంగా ఉండటంతో పంటల దిగుబడులు తగ్గిపోతాయి. ఈ సమస్యలను అధిగమించేందుకు వాలుకు అడ్డంగా బోదెలు, కాల్వలు నిర్మించుకోవాలి. ఒక మీటరు దూరంలో కనీసం మూడేళ్లకొకసారి లోతుగా దున్నుకోవాలి. పశువుల ఎరువు, ఇతర సేంద్రియ ఎరువులను వినయోగించుకోవాలి.

మాగాణి భూముల్లో..

వరి కోతల అనంతరం అందులో ఆరుతడి పంటలు వేయడానికి భూమిని దున్నగానే మట్టి పెల్లలు పెద్దవిగా లేస్తాయి. అందువలన వేసిన పైరు సరిగా మొలకెత్తదు. మొక్కల సాంద్రత తక్కువగా ఉంటుంది. దీని నివారణకు భూముల్లో మొదట మామూలు నాగళ్లు వేసుకొని దున్నిన తరువాత రోటావేటర్ లేదా పల్లదంతితో తేలికగా దున్నితే పెద్ద పెల్లలు పగిలి ఆరుతడి పంటలకు అనువుగా ఉంటుంది.

సున్నపు నేలల్లో అయితే..

వీటిని గుర్తించడానికి 1:4 నిష్పత్తిలో హైడ్రో క్లోరిన్ ఆమ్లం, నీరు కలిపి ఒక చుక్క మిశ్రమాన్ని మట్టిపై వేసినప్పుడు బుసబుసలాడే నురుగ వచ్చినట్లయితే దానిలో సున్నం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించవచ్చు. ఈ నేలల్లో భాస్వరం ఎరువు వినయోగ సామర్థ్యం తక్కువగా ఉండటమే కాకుండ సూక్ష్మ పోషక పదార్థాలైన జింకు, ఇనుము, మాంగనీస్, రాగి లోపాలు ఉంటాయి. ఎకరానికి 4 టన్నుల పశువుల ఎరువు వేసి పంట నష్టాన్ని తగ్గించవచ్చు. జనుము, జీలుగలను పచ్చిరొట్ట పైర్లుగా పెంచి నేలలో కలియదున్ని మురిగిపోయేలా చేస్తే సున్నపు సమస్య తగ్గుముఖం పడుతుంది.

నీటి నిల్వల సామర్థ్యం లేని భూములు..

ఇలాంటి భూముల్లో ఇసుక శాతం అధికంగా ఉంటుంది. బంక మన్ను 20 శాతం కన్నా తక్కువగా ఉంటుంది. దీని కోసం ఎకరానికి 40 టన్నుల చౌడు స్వభావం లేని చెరువు మట్టిని వేసవిలో వర్షాలకు ముందుగానే తోలించుకోవాలి. చెరువు మట్టి పొలంలో కలవడం వలన బంకమన్ను శాతం పెరిగి భూమికి నీటిని, పోషక పదార్థాలను నిల్వ చేసుకొనే సామర్థ్యం పెరగుతుంది.

గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి


కొణిదెనలో క్రికెట్ పోరు


బహుమతి అందిస్తున్న దాతలు

బల్లికురవ: వేసవిలో ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చేందుకు జిల్లా స్థాయిలో నిర్వహించిన టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల్లో గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలని బహుమతులు అందిస్తున్న దాతలు అన్నారు. మండలంలోని కొణిదెన గ్రామంలోని ఎస్సీ కాలనీ వద్ద గత నెల7న ప్రారంభమైన క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 42 టీంలు ఎంట్రీలు సమర్పించగా ఎండను సైతం లెక్క చేయకుండా నువ్వానేనా అన్నట్లు హోరాహోరీగా పోరు జరిగింది. పోరులో మొదటి బహుమతి కొమ్మినేనివారి పాలెం గ్రామం జట్టు కైవసం చేసుకోగా రూ. 20116, గ్రామానికి చెందిన జంధ్రాజుపల్లి ముఖేష్ అందజేశారు. రెండో బహుమతి రూ.15116ను కొణిదెన లిటిల్‌బాయ్స్ టీం కైవసం చేసుకోగా గెల్లా హరిబాబు, మూడో బహుమతి రూ. 10116 ముక్తేశ్వరం టీం కైవసం చేసుకోగా బట్టి హనుమయ్య అందజేశారు. పోటీలకు సహకారం అందించిన దాతలకు నిర్వాహక కమిటీ కృతజ్ఞతలు తెలియజేశారు.

వాకర్స్ సేవా కార్యక్రమాలు అభినందనీయం


నగదు అందిస్తున్న దాత శ్రీనివాసరావు, వాకర్స్ సభ్యులు

చీరాల రూరల్: వాకర్స్ ఇంటర్నేషనల్ చీరాల వాకర్స్ సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూలు, చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక హైస్కూలు క్రీడామైదానంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వాకర్స్ సభ్యులు కొత్తమాసు శ్రీనివాసరావు వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులకు, బాలింతలకు అన్నదానం నిర్వహిస్తున్న వూరా మస్తాన్‌రావు చారిటబుల్ ట్రస్టుకు రూ. 2,500, పేరాల దీనజన సేవా సంఘానికి బియ్యం నిమిత్తం రూ. 1,500, అలానే గోసేవా సమాజానికి గోవులకు తవుడు నిమిత్తం రూ. 750 అందజేశారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ మాట్లాడారు. వాకర్స్ సభ్యుల సహకారంతో నిత్యం సేవా కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా ఆరుపదుల వయసులో కూడా ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతిరోజూ సభ్యులు వాకింగ్, వ్యాయామాలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సెక్రటరీ చారుగుళ్ల గురు ప్రసాద్, అమరా వీరాంజనేయులు, వంగర పూర్ణచంద్రరావు, వి. రాంబాబు, దేవకి సుబ్బారావు, డేగల తిరుపతిరావు, దరియా సాహెబ్, శేషసాయి, నారాయణమూర్తి, మధు, రమేష్ పాల్గొన్నారు.

కొప్పరపాడు విద్యార్థుల ప్రతిభ


కొప్పరపాడులో తల్లిదండ్రులను సత్కరిస్తున్న హెచ్‌ఎం ఉపాధ్యాయులు

బల్లికురవ: జాతీయ మెరిట్ మీన్స్ స్కాలర్‌షిప్ పరీక్షలో కొప్పరపాడు పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకోవటం ఎంతో ఆనందాన్ని ఇస్తోందని పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం జి.నాగేశ్వరరావు అన్నారు. ఇటీవల జరిగిన ఎన్ఎంఎంఎస్ పరీక్షలో జిల్లా స్థాయిలో మొదటి రెండో స్థానం కైవసం చేసుకున్న విద్యార్థులను బుధవారం గ్రామంలో ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో సత్కరించారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు నాలుగు మాసాల క్రితం చీరాల్లో పరీక్ష రాశారు. ఫలితాలు వెలువడగా వీరిలో యస్. కీర్తన జిల్లా స్థాయిలో మొదటి స్థానం జి. కోటేశ్వరరావు రెండో స్థానం, మరో పదిమంది విద్యార్థులు ప్రతిభతో స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. ప్రభుత్వం నాలుగు సంవత్సరాల పాటు బ్యాంకు ఖాతాలకు సొమ్ము జమ చేర్పమని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యతో అత్యున్నత స్థాయిలో విద్యార్థులు సత్తా చాటుతున్నట్లు హెచ్‌ఎం వివరించారు. పీఎంసీ చైర్మన్ దమ్ము అంజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం వైశాఖ మాసం రోహిణి నక్షత్రం అమావాస్య తిథి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 5 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు వహించండి


వేమవరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

బల్లికురవ: వర్షాల సీజన్ ఆరంభమైనందున సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలు తగు జాగ్రత్తలు వహించాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్ కోరారు. బుధవారం వేమవరం గ్రామంలో 104 ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. షుగరు, బీపీ, హిమోగ్లోబిన్ పరీక్షలతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సాయంత్రం శిబిరానికి రాలేని వృద్ధులకు ఇంటింటికి వెళ్లి పరీక్షలతో మందులు అందజేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు


మొక్కలు నాటుతున్న న్యాయమూర్తి రెహన, సిబ్బంది


మొక్కలు నాటుతున్న చంద్రా రెడ్డి

చీరాల అర్బన్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, పర్యావరణహిత జీవనంతో ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని బాపట్ల జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సమగ్ర శిక్ష బాపట్ల జిల్లా ఆధ్వర్యంలో చీరాల్లోని ఏపీ మోడల్ స్కూల్ ఆవరణలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలంతా పర్యావరణ హిత జీవనశైలిని అలవర్చుకునేలా గ్రామ స్థాయి నుంచి విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. పర్యావరణహితానికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. నీటిని సంరక్షించే వ్యవసాయ పద్ధతులు పాటించాలని, వర్షపునీరు ఆదా చేయాలని, వృథా చేయకూడదన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వడం, పరిసరాల పరిశుభ్రత, ఎక్కువగా మొక్కలు నాటడంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. ఈనెల 12 నుం ఇ 19వ తేదీ వరకు పాఠశాలలో ఎకో క్లబ్‌ల ద్వారా పర్యావరణ హిత జీవనశైలి కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం ప్లాస్టిక్ వ్యతిరేక ప్రతిజ్ఞను చేసి ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ జె.సరళ, సమగ్ర శిక్ష అధికారులు శ్రీనివాసరెడ్డి, చారులత, డీసీఆర్‌బి సెక్రటరీ డి.ప్రసాదరావు, నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా కో ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, చీరాల ఎంఈఓ–1 పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే పర్యావరణ పరిరక్షణ

చీరాల అర్బన్: ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ ప్రజా సహకారంతోనే సాధ్యమవుతుందని రిటైర్డ్ ప్రిన్సిపాల్, పర్యావరణ పరిరక్షణోద్యమకర్త జంపాల గంగాధరరావు అన్నారు. బుధవారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. భూకాలుష్యాన్ని తగ్గించకపోతే భవిష్యత్తుకే ప్రమాదమన్నారు. ప్లాస్టిక్ బ్యాగుల వాడకాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. కాలుష్య నివారణలో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. సభకు గాదె హరిహరరావు అధ్యక్షత వహించగా సమితి ఆధ్వర్యంలో సంచులను పంపిణీ చేశారు. సింహాద్రి యల్లమందారెడ్డి, ఎ.రామారావు, జయరామిరెడ్డి, కోడూరి ఏకాంబరేశ్వరబాబు, లోహియా, వూర మస్తాన్‌రావు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణం పదిలం

వేటపాలెం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని ట్రీ ఫౌండేషన్ సమన్వయ కర్త శవనం చంద్రా రెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర అటవీ శాఖ, ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పొట్టి సుబ్బయ్యపాలెం తీర ప్రాంతంలో గల గంగమ్మ గుడి ప్రాంగణలో రావి మొక్కను బుధవారం నాటారు. ఆయన మాట్లాడుతూ పర్యావణనాన్ని సంరక్షించలంటే మొక్కలు పెంచు కోవడమే ప్రధాన మార్గమన్నారు. పెరిగి పోతున్న కాలుష్యంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయన్నారు. వీటి వల్ల రాబోవు తరాలు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థిలు ఉన్నాయని గుర్తుచేశారు. బి. శిరీష, సముద్ర తాబేళ్ల సంరక్షకులు వెంకటేష్, జాలయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

చీరాల రూరల్: పర్యావరణం పదిలంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రెహన అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయమూర్తి చేతులు మీదుగా మొక్కలు నాటారు. ఆధునీకరణ పేరుతో పచ్చని చెట్లను నరికి కాంక్రీటు వలయాలను నిర్మిస్తున్నారని చెప్పారు. సరైన సమయంలో వర్షాలుపడి పంటలు పండాలంటే పుష్కలంగా చెట్లు ఉండాలని సూచించారు. చెట్లను నరికివేయడం వలన వాతావరణంలో విపరీతమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని తద్వారా పర్యావరణానికి పెనుముప్పు కలుగుతుందని చెప్పారు. సరైన సమయంలో వర్షాలు పడకపోవడం విపరీతమైన ఎండలు కాయడం వంటి దుష్పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. భవిష్యత్ తరాలు బాగుండాలంటే పర్యావరణం సరైన మార్గంలో ఉండడం ఒక్కటే మార్గమని, అందుకు ప్రతి ఒక్కరూ ఇంటికొక మొక్క నాటి వాటిని పెంచి వృక్షాలుగా చేయాలని న్యాయమూర్తి తన సందేశంలో పేర్కొన్నారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు, న్యాయవాది బి. ఆరోగ్యరావు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకొల్లు (చినగంజాం): పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా చేపట్టాలని ఇడుపుల పాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పిడవర్తి పేరిరెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం బుధవారం ఇడుపుల పాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తారని. పర్యావరణానికి అనుకూలమైన చర్యలు తీసుకోవడానికి ఈ రోజు చర్యలు తీసుకుంటారని, ఇది యూనైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా నడుస్తుందన్నారు. వృక్షో రక్షి తే రక్షితః అనే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని, ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటాలని సూచించారు.


సంచులు అందిస్తున్న దృశ్యం


మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు



మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మలేరియా, డెంగీ నివారణ చేయాలి


మలేరియా వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది

చినగంజాం: సమాజ భాగస్వామ్యంతో మలేరియా, డెంగీ వంటి వ్యాధులు నివారించవచ్చునని చినగంజాం వైద్యాధికారి పి. సాయి శ్రీ చరణ్ అన్నారు. బుధవారం చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మలేరియా వ్యతిరేక మాసోత్సవం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దోమలు పుట్టకూడదు, దోమలు కుట్టకూడదంటూ నినాదాలు చేశారు. ప్రతి ఒక్కరూ జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో బాగస్వామ్యులై నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని, దోమలు ఉత్పత్తి కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం ప్రతి ఒక్కరూ డ్రైడే పాటించాలని, మలేరియా, డెంగీ వంటి దోమలు ద్వారా వచ్చు వ్యాధులను తద్వారా నిర్మూలించాలని సూచించారు. చీరాల కమ్యూనిటీ ఆఫీసర్ పి. శ్రీనివాసరావు, సీహెచ్‌ఓ ఝాన్సీ రాణి, సూపర్ వైజర్ చిరంజీవి, ఉల్దారాణి, పీహెచ్ఎస్ బేబి పాల్గొన్నారు.

చినారికట్లలో మోస్తరు వర్షం


చినారికట్ల జంక్షన్‌లో వర్షం

కొనకనమిట్ల: ఆవర్తన ప్రభావంతో బుధవారం సాయంత్రం కొనకనమిట్ల మండలంలోని చినారికట్ల, బచ్చలకూరపాడు, గొట్లగట్టు, పాతపాడు గ్రామాల్లో మోస్తరు వర్షం పడింది. వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు. పొలాలు పదునెక్కడంతో వేసవి దుక్కులు దున్నుకునేందుకు అనువుగా ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న ఉభయదాతలు

పొదిలి: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి బుధ వారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. యల్లటూరి అంకమరావు, వెంకట రమణ దంపతుల ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం చేశారు. ముందుగా ఆలయంలో అర్చకుడు మురళీచార్యుల ఆధ్వర్యంలో దంపతులు పూజలు నిర్వహించారు.

చెస్‌తో విద్యార్థుల్లో మేధో వికాసం


చెస్ గేమ్ ఆడుతున్న విద్యార్థులు

మార్కాపురం: చెస్ ఆడటంతోపాటు పుస్తక పఠనం చేయడం వల్ల విద్యార్థుల్లో మేధస్సు పెరుగుతుందని గ్రంథపాలకుడు జీవీ శివారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో 19వ రోజు వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులతో కథలు చెప్పించడం, పుస్తకాలు చదివించడం, బ్రెయిన్ గేమ్స్ ఆడించారు. హాజరైన విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేసినట్లు లైబ్రేరియన్ తెలిపారు.

గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు


వేసవి శిక్షణా తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

బేస్తవారిపేట: స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను బుధవారం గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధ్యాయుడు పీవీ గురుస్వామి విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ గ్రామర్, కథలు చెప్పడం, వినిపించడం, చెస్, క్యారమ్స్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. 29 మంది విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరానికి హాజరైనట్లు గ్రంథపాలకుడు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25431
చీరాల డివిజన్
90101 55593 (చీరాల)
Office mail : sakshiongads@gmail.com